


# ఎక్కడున్నట్టు

చాకా శివకోటి

**"మనకు స్వతంత్రమొచ్చి ఏభైయేళ్లు అయిందిట!" అన్నాడు రాఘవులు నడుస్తూ.**

**'ఏభైయేళ్లు ఇంత తొందరగ ఎట్టయినయ్?' అన్న భావన అతనిలో కనిపించింది.**

"అయితే ఏందట? నాకూ ముడ్డిమీదకు ఏభై ఎనిమిదేళ్లు వచ్చినయి. ఆరుపళ్లు ఊడినయి. మోకాళ్లకు కలకలొచ్చినయి. కళ్లకు మసకలొచ్చినయి. ఒంటరక రైతును ఇప్పుడు కూలోడ్నయిన. పోరళ్లు పెరిగి పనికిరానోళ్లయిన్రు - డిగ్రీలుండీ. పోరి ఎదిగి దానికి మనువు చేయలేననుకుని ఇల్లొదిలి పోయింది. ఎంత ఎతికినా దొరకలే. ఒక్క పోరి అని ఎంతో బొరిపంగనో పెంచిన రాఘవులూ!" అని కళ్లు తుడుచుకున్నాడు శివయ్య.

"అయ్యో! ఊర్కో! అట్టయితవేందే? మన హుసేనయ్యలేదూ, వానికి ఈ దేశ స్వర్ణోత్సవాల సందర్భంగ మన ఎం.ఎల్.ఏ. సన్మానం జేస్తుండట! గా ముచ్చట చూసేందుకు రమ్మనమని ఊరోళ్లకు కబురు చేసిండులే! అది చెప్పేటందుకు నేను మొదలుపెడితే, నువ్వేమో ఇట్టయితివి. మన రాత ఎట్టుంటేఅట్ట జరుగుతది. ఎవడేం చేత్తడు. అయినా ఎల్లకాలం ఇట్టనే ఉంటదా?" అని సముదాయించిండు రాఘవులు.

"ఇంకేం మారతది? బతుకు అయిపోవస్తంది!" అని కళ్లు తుడుచుకుని ఆగిండు.

"ఏందే ఆగినవు?"

"హుసేనయ్యకు సన్మానం జేస్తన్నరా?" అడిగిండు శివయ్య కళ్లింత జేసి.

"ఆఁ! అవు మల్ల!" అన్నడు ఉత్సాహంగా రాఘవులు.

"ఎందుకట?"


"అదేనే! స్వాతంత్ర సమరయోధులకు సన్మానం జేస్తున్నరట. వీనికీ ఈ పింఛను వచ్చిందట."

"వీడెప్పుడు సమరయోధుడయ్యిండు? చిన్నప్పటినుంచీ నా ఎరికలోనివాడు. స్వతంత్రమొచ్చినప్పుడు ఆరేడేళ్ల పోరడు వీడు. వీని తండ్రి కటికిదుకాణం కాడ కుక్కలు రాకుండ అదిలించెటోడు. అదీగాక దేశానికి స్వతంత్రమొచ్చినంక గూడ మనకు 'నైజాం'న స్వతంత్రం రాకపాయె. అప్పుడు వీని అయ్య కటికి దుకాణం వదలి రజాకార్లల్లో గలిసె. స్వతంత్రం

కోసం తిప్పలుబడేటోళ్లను, చానామందిని వీడు చంపించెగద! ఊళ్లు తగలబెట్టె. ఆడపోర్లను ఆగంజేసె. వాని కొడుకే గద వీడు! వీడిప్పుడు స్వతంత్రం సమరయోధుడైండా? వీనికేమో మన ఎం.ఎల్.ఏ. సన్మానం జేస్తన్నడా?" అన్నాడు చిత్రంగా ముఖంపెట్టి. ఏడవాల్నో, నవ్వాల్నో తెలీక.

"నాకీ మతలబు తెలీదే! నల్గురు సమరయోధులకు సన్మానం ఉండాది. వాళ్లలో మన హుసేనయ్య ఒకడు. వాడు కబురెట్టిండు. చూసొద్దాం పొరాదు!" అని. "నువ్వేందే? ప్రతిదాన్ని గిట్ల రాద్ధాంతం జేస్తవు?" అంటూ నడిచిండు రాఘవులు.

"చూద్దాం! నిజంగ మన స్వతంత్రంకోసం పోరాడినోళ్లయితే కాళ్లకు మొక్కొచ్చు. కానీ, వీడేమిటి? ఇట్లా ఎందుకంటున్నరు? ఇదేమన్న డబ్బులతో కొనుక్కునేదా! పరీక్షలుగట్రా రాసిపాసయ్యేదా? ఏ యూనివర్సిటీనో, సాంస్కృతిక సంగమో ఇచ్చేటి బిరుదా? ఓట్లతో గెలిచెడిదా? దాన్ని ఎవనికి పడితే వానికి పైరవీ జేసుకుంటే ఇచ్చేటందుకు? అది! మనకు స్వతంత్రం వచ్చిన నాటికి వీనికి కటికిదుకాణం, దానిముందున్నకుక్కలు తప్ప మరోటి తెలవదు. వచ్చినాక కలపఅడితిలో చాయ్‌మోసేటందుకు కుదిరిండు. మనకు ఒక దేశమున్నదనీ, అది తెల్లోళ్లకింద ఉన్నదనీ, మన బాపూజీ తుపాకీ లేకుండా, యుద్ధం లేకుండా స్వతంత్రాన్ని సంపాదించిపెట్టాడనీ, నెహ్రూగారు చనిపోయిందనక వీనికి తెలీదు. వీనికి స్వతంత్ర సమరయోధునిగా సన్మానమా?" అని పిచ్చోడి లెక్కన నవ్వి, "రాఘవులూ! ఇది చూడాల్సిందే, పోదాం పద!" అన్నాడు శివయ్య.



శివయ్య మొహం ఎర్రగా కందిపోయి ఉండింది.

వీని తరీఖ రాఘవులుకు అంతు పట్టలేదు. "అరె, ఉన్న ఊరోడు, పెద్దోడయి సన్మానం పొందుతుంటే సణుగుడేంది? వాని అద్రుష్టం వానిది. ఒకనిది మరొకనికి వస్తదా? మన ఊరి పోలయ్య గా రోజులలో పట్నంకెల్లి ఒక చదువు సర్టిఫికేటు కొనుక్కొచ్చుకోని గవర్నమెంటు నౌకరీలో జేరతే, ప్రమోషన్లు వచ్చి జిల్లా అధికారాయె. ఎనకబడినోడని వాణ్ణి ఇంకా ఇంకా పైకి ఎగదోస్తిమి. వానద్రుష్టమది. అట్లాటోళ్లను జూసి కుళ్లితే ఏమొస్తది. పేగులు చెడతయి తప్ప!" అనుకుంటూ నడిచిండు.

వర్తకసంఘం దాపునుంచీ తోరణాలు కనపడ్డయి. సభ దాంట్లోనే అన్నమాట. బయట పెద్దగ జనం లేరు, తోవన పోయేటంద్రు తప్ప. బానర్లు మాత్రం అయిదారు కనపడినయి.

లోపలికి నడిచారు. రెండొందల కుర్చీలు పరచి ఉన్నయి. ఏభైమంది దనక, చిన్నా పెద్దా కూర్చుని ఉన్నరు. పూలతో వేదికను మంచిగ అలంకరించినారు. దానిపైన రాజకుమారుడి కుర్చీలు అయిదువేసి ఉన్నాయి. రెండు పెద్ద బుట్టెల నిండా పూలదండలు పక్కనే ఉన్నయి. మైకు పెట్టినారు.

'లే! లే! లే! లేప మంటావా? లేచి వస్తావా!" అన్న జ్యోతిలచ్మి డాన్సు పాట రంజిగ ఇనపడతన్నది. పసి పోరళ్లు పాటకనుగుణంగ ఎగురుతున్నరు. సుస్వాగతం కాడ మాత్రం నల్గురయిదుగురు సభ జేసేటోంళ్లు ఎం.ఎల్. ఏ. రాక కోసం ఎదురు చూస్తున్నరు. సన్మానం జేయించుకునేటోంళ్లు ముందరనే వచ్చి సంఘం ఆఫీసులో కూర్చుని ఉన్నరు.

"పద, మనం ఎదురుగ్గా కూర్చుందాం!" అన్నాడు శివయ్య.

అటుగ నడవబోతుండగ సంఘంనుంచి శ్రీ కేశవరావుగారు వస్తూ ఎదురుపడిండు. నిజం స్వతంత్రం సమరయోధుడంటే ఆయన. ఏదన్న జేస్తే అట్లాంటోనికి జెయ్యాల. ఆ రోజులలో గ్రంథాలయం పెట్టి దాన్ని రాజకీయ కేంద్రంగా మార్చి స్వాతంత్ర సమరయోధుల వేదికగా మలచిండు. జైలు కెళ్లిండు. లాఠీదెబ్బలు తిన్నడు. గాంధీగారిని ఈడకు తీసుకొచ్చి జనానికి చూపించిండు.

"నమస్కారమయ్యా! బావున్నరా?" అన్నాడు శివయ్య వంగి దండం పెట్టి.

కళ్లజోడు సర్దుకుని, పరిశీలనగా చూసి, "ఓం! నువు రామయ్య కొడుకువు గదూ!" అని భుజం తట్టి, "అమ్మ బావుందా?" అని, "మీ నాన్న, నేను జోడుగుర్రాలలా ఉద్యమంలో పనిచేసినం. రాత్రో పగలో తెలీక అదే ధ్యాసలో తిరిగినం. వాణ్ణి కాపుకాచి రజాకార్లు పొట్టన పెట్టుకున్నరు!" అని అరక్షణం ఆగి, "బాబూ! నేను మిమ్మల్ని ఆదుకోలేకబోయిన" అని, 'మన్నిస్తవు గదూ!' అన్నట్టు చూసిండు. ఆయన సంస్కారానికి శివయ్య కళ్లు నీళ్ల కుండలయినయి.

"పిల్లలేం జేస్తన్నరు?" అడిగిండు. పాత గుర్తుల వల నుంచి బయటకొస్తూ. ఆయన కళ్లలోనూ చెమ్మ కనిపించింది.

"మీ ఆరోగ్యం ఎలా ఉంది?" అడిగాడు శివయ్య ఆయనడిగినదాన్ని వదలి.

"పిలుపుకోసం ఎదురు చూస్తున్నా!" అన్నాడు నవ్వుతూ చేతులు పైకెత్తి.

చాలాదూరం ఆయన వెంటనే నడిచి, వచ్చికూర్చున్నాడు శివయ్య.

ఇంతలో "ఎం.ఎల్.ఏ. గారొస్తున్నడు" అన్న హడావుడి నిర్వాహకులలో కనపడింది. పోలీసు కుక్కలు వాసన చూస్తూ దొంగల్ని కనిపెట్టినట్టు - ఎం.ఎల్.ఏ. గారి కారుశబ్దాన్ని వారు గ్రహించినట్టుంది.

వెయ్యి సి.సి. కారు మెత్తగ వచ్చి ఎదురుగ

## ఉగాది కానుక

శిథిలపత్రంగా నేలరాలిపోయిన క్షణంనుండీ
ఋతువుల కౌగిళ్లలో
రూపాంతరధ్యానం చేస్తున్న బీజంగా మనిషి..
చూస్తున్నావా..?
కొత్తఉడుపులు తొడుగుతూ
చిగురు ఊయల్ని శిల్పిస్తున్న
పురావయస్సారభఋతాన్ని;
ఇది
ఒక స్మృతేతిహాసం...
వింటున్నావా..?
భూతబిందుస్స్పృహాజాతమైన
వర్తమానప్రవాహం
రేపును స్పృశిస్తున్న అనుస్యూతప్రాణాన్ని
ఇది
జీవనజ్వాల మొదలైన ప్రాచేతసశిశురోదన...
సుమహోమాన్ని రగిల్చినకాలం
చెట్లను వర్ణసంకలితం చేసింది
పంచమస్వరాన్ని దాల్చినకాలం
కోకిల్లకు గొంతు జలపాతాన్ని అందించింది
బ్రతుకు చెట్టు కొమ్మలమీద రెక్కలు విప్పుకున్న శకుంతాలు
దిగంతాన్ని పద్యాల పొలిమేరలుగా మార్చాయి
పువ్వుమీంచి నవ్వుమీంచి
పుప్పొడి పారాణి పాదాలతో సీతాకోకచిలుక
గాలిని వాక్యంగా మలిచింది
నిద్ర ఎరుగని కళ్లకు కల దాసోహమంది
వాదాలభ్రాంతిలో పడి నాదాలు నినాదాలవుతుంటే
ఉగాది హృదయకాసారంలో నిశ్శబ్దంగా
స్వర్ణకమలం సాక్షాత్కరించింది...

**సాంధ్యశ్రీ**

ఆగింది. కారున ఉన్న ఏ.సి. నుంచి బయటకొచ్చాడు ఎం.ఎల్.ఏ. గారు. బయట వాతావరణం సౌకర్యంగ అనిపించలేదు. అసహనంగ మొఖం పెట్టి నడిచాడు. కనీసం ఏ.సి. కారూ, మంత్రిపదవీ లేంది ప్రజాసేవ నిఖార్సుగ చేసే వీలు దొరుకనికాలం గదా! సరే, ఈయనంటే వేరు. జనం పట్ల అంకితభావం ఉన్నవాడు.

సభా నిర్వాహకులు ఆదరబాదరా నాల్గు గులాబీదండల్ని తలా ఒక్కటి పుచ్చుకొని ఊపిరి సలపనీయకుండా మెడనవేసి, ఓ పని అయిపోయినట్టు పక్కకు వచ్చారు. స్టేజి వైపు నడిచాడు ఎం.ఎల్.ఏ.గారు వేగంగా.

ఆయన వెంట సభా నిర్వాహకులు, వందిమాగధులూ, గొర్లకాపరి 'రిక్కే'స్తూ నడుస్తూంటే వెనకవచ్చినట్లు నడిచారు. సభా నిర్వాహకులు మొదట ఎం.ఎల్.ఏ. గారినీ, ఆనక సన్మానగ్రహీతలు నల్గురనూ స్టేజీమీదకి ఆహ్వానిం చారు. సభా కార్యక్రమం ప్రారంభించమని అధ్యక్షులవారికి చెప్పి, నిర్వాహకులు స్టేజీకిందకు దిగారు.

"ఇందులో హుసేనయ్య ఎవరు?" అడిగాడు శివయ్య.

"చెప్త! అదిగో, ఎం.ఎల్.ఏ. గారి ఎడంపక్కన కూర్చోలేదూ, ఆయన! కుడిపక్కన కూర్చున్నోడేమో ఎ.ఎ. రాములు. రాములెంట కూకున్నోనేమో వరదయ్య. ఆ రోజుల్లోనే ముంజేయివరకూ ఇరిగిపోయింది. హుసేనయ్య పక్కనున్నది మాత్రం దేవయ్య అని - పెద్దమనిషి" అన్నాడు.

"ఈ దేవయ్య అనేటోడు 1984లో ఓ మర్డరు కేసులో ఉన్నడు గదా! పైగ రాజకీయపార్టీవోడు. అవునా?"

"నాకు తెలీదు. అసలు హుసేనయ్య తప్ప, నాకు అంతగా తెల్సినోడే లేడు."

"ఎ.ఎ. రాములంటే?"

"అనంతరాములు. అంటే మా ఊరి పక్కనున్న పైరవీకారు! ఛ!" అని సభా వేదికవైపు నిప్పులు గక్కేలా చూస్తూ, "నేను విన్నదీ, చూస్తున్నదీ నిజమే! కానీ నిజాన్ని చంపిన నిజమిది!" అని లేచి, పెద్దగ అరవబోయాడు. "మీరట్రా స్వతంత్ర సమరయోధులూ? లుచ్చా నా కొడకుల్లార! మిమ్మల్నిట్ల అంటున్నదెవడురా?" అని ఆవేశంగ లేచాడు. అంతే! తల తిరిగినట్టనిపించింది. వాంతి వచ్చేట్టు వంగాడు.

రాఘవులు కంగారుగ లేచి, "ఏమయిందే?" అని పట్టుకున్నడు. పక్కోడు షోడా తెప్పించిండు. సగంతాగి, సగంతో మొఖం కడుక్కున్నాడు. తేరుకుని నిలబడి, "రాఘవులు ఈడిదనక పోయొద్దం!" అన్నడు మెల్లగ.

ఎం.ఎల్.ఏ. చెప్పెడిది అసలు వినపడటంలేదు శివయ్యకు.

"ఏడికి పోదమంటవు?" అడిగిండు రాఘవులు.

"కేశవరావుగారిల్లు ఇక్కడే! ప్రశాంతంగ ఉంటది. కాసేపు కూర్చునివద్దం! "

"అట్టనే!" అని నడిచారు. ఇంటికి చేరారు. వరండాలో చాపలు పరిచి ఉన్నయి. నాల్గుదిండ్లున్నయి. మంచినీళ్ల కుండ ఉంది పక్కన. మళ్లా నీళ్లు తాగాడు శివయ్య. ఆనక దిండుకానుకొని గోడకు జారిగిలపడ్డాడు.

భయం భయంగ చూసిండు రాఘవులు పక్కన కూర్చుంటూ.

అరగంటలోపే మామూలు మనిషయిండు శివయ్య. "ఇక పోదామే!" అని లేచిండు.

"అరె! నీ ఒంట్లో సైసుగ లేదు. నువ్వేడికి వస్తవు?" అన్నాడు రాఘవులు.

"బాగానే ఉన్నదిలే, పద!" అని బయలుదేరిండు శివయ్య.


ఎం.ఎల్.ఏ. గారి ఉపన్యాసం పూర్తిగావచ్చింది.

"ఎ.ఎ. రాములు గారు కృషి చేసి అనేకమంది స్వాతంత్ర సమరయోధులకు (బృతి) పెన్షను మంజూరు చేయించిండు. ఆయన శ్రమజీవి. స్వతంత్రానికి ముందూ, ఇప్పుడూ కూడా. ఈయనకు ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని ..." సెలవు తీసుకున్నాడు.

చప్పట్లు పెద్ద ఎత్తున - ముందునుంచి మోగినయి. అక్కడున్నవారంతా నిక్కర్లేసుకున్న పోరళ్లు.

ఆనక నల్గురినీ దుశ్శాలువలతో సత్కరించారు.

జరిగిన సన్మానానికి సమాధానంగా నల్గురూ ఆనందాశ్రువులను రాలుస్తూ, ముకుళిత హస్తాలతో నమస్కరించారు. (ఏభై ఏళ్లుగా గొర్రెల




స్వభావాన్నే పుణికిపుచ్చుకొని ఉన్న ప్రజలకు ఇంకో ఏభైఏళ్లయినా మీరు ఇలాగే ఉంటే బాగని ఆనందపడుతూ) ఎ.ఎ. రాములు అనే అప్పడాల అనంతరాములు. స్వతంత్రానికి ఆరేళ్ల ముందు పుట్టి స్వతంత్రంలో జంగిరి గొడ్లను కాయడం ప్రారంభించాడు. ఈ సంగతి అక్కడ ఊళ్లలో అందరికీ తెలుసు. ఇతన్ని ఆనక బడికి పంపడం, వీనికి ఉసికలో అక్షరాలు రుద్దించినా వేళ్లకు నెత్తురొడవడం తప్ప అక్షరం ముక్క అంటకపోవడమూ తెల్సు. ' 'అ' మొదటక్షరం గదా! దాన్ని రాయరా' అనీ పంతులు అనగానే, ఆఁ! అని పెద్దగ ఏడుపు లంకించుకొనేవాడు. పంతులుకు మిగిలినపిల్లలకు చదువు ఎలా చెప్పాలో తోచి చచ్చేది కాదు. ఈ బాధ పడలేక పంతులు వీణ్ణి ఏమీ అడిగేవాడు కాదు. ఇదే అదనుగా తీసుకుని వీడు నిద్రపోయి, బడిగంట మోగాక గానీ లేచేవాడు కాదు.

రెండేళ్లు చూసి మళ్లా ఎడిగొడ్ల వెంట తోలారు. ఆ పశువుల్ని కాయడం తప్ప ఇంతకుముందు తెల్లోళ్ల రాజ్యముంది, ఇప్పుడు మనోళ్ల రాజ్యమొచ్చిందని పాపం, అనంత రాములుకు పెళ్లయిందాకా తెలీదు. ఇతగాడు ఇప్పుడు స్వాతంత్ర సమరయోధుడు! అంతేగాక ఇట్లాంటి వాళ్లకు స్వతంత్ర సమరయోధుల భృతి ఇప్పించిన దాత! ఇదేదో అప్పనంగా బొడ్లోని పుగాకుకాడ దానం చేసినట్టుంది!

"ఇగో, శివయ్యా! నీ కీ సంగతి తెలుసా?" అడిగాడు రాఘవులు.

'ఏంటో?' అన్నట్టుగ చూశాడు.

"ఈయన తన పెళ్లానికీ, సెకండుసెటప్పుకు కూడా ఈ పింఛనును ఇప్పించుకున్నాడు. ఈ పింఛను డబ్బే గాక, ఫ్రీగా రైల్వేపాసు, బస్సుపాసు, ఫ్రీ వైద్యం, రాయితీలతో ఫోను ... ఇంకా అనేక సౌకర్యాలున్నాయట!" అని ఆగి, "శివయ్యా! మనకీ ఇప్పిస్తే బాగు, ఎంతో కొంత ముట్టజెప్పొచ్చు!" అన్నాడు.

"ఛూ!" అని లేచాడు శివయ్య.

ఉలిక్కిపడ్డట్టుగా లేచి, వెంట నడిచాడు రాఘవులు. 'బాగుపడ్డవాళ్లను చూస్తే వీనికి కడుపుమంట! వీనికి అవకాశం ఉన్నా అటుపోడు. ఇంతెందుకు శివయ్య తల్లి మంగవ్వ 'ఈ పిన్ననుకు దరఖాస్తు పెట్టుకోరాదె!' అని అడిగితే, 'ఏదో వస్తదని మా ఆయన చేయలేదు. స్వతంత్రం మనకోసం మనం తెచ్చుకొనేది. అది ఇక్కడ పుట్టిన మనిషిగ మన బాధ్యత. కూలిపని గాదు' అన్నది. ఆ అమ్మకొడుకే గద వీడు!' అని కసిగా అనుకున్నాడు.

అట్లా అరగంట నడిచారు - మాటా, పలుకూ లేకుండా. పైగా ఏందో పోగొట్టుకున్నట్టుగ దిగులుగ కనిపించాడు శివయ్య.

కొద్దిగచాయ్ అన్న తాగితే బాగు అనిపించి, ఆగి, "శివయ్యా! చాయ్ తాగుద మేం?" అన్నాడు.

ఉలిక్కిపడ్డట్టుగ చూసి, "ఆఁ ... ఆఁ ...!" అన్నాడు.

ఇద్దరూ టీబడ్డీ దగ్గర ఆగి, చాయ్ మంచిగ ఇయ్యమని చెప్పారు.

"రాఘవులూ! స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నవారెవరో, ఎవరు దొంగలో కూడా గుర్తించలేని కనాకష్టపు ప్రభుత్వాన మనమున్నం. అంటే, అసలు ఈ దేశానికి స్వతంత్రమొచ్చిన సంగతన్న గుర్తులో ఉందో, లేదో?" అని అదోలా పెద్దగ నవ్వి, "అట్టాటి దశన స్వర్ణోత్సవాలు! దేనికీ స్వర్ణోత్సవాలు? ఏభై ఏళ్లు వయసొచ్చినందుకా?

ఏభై ఏళ్ల అజ్ఞానానికా?

ఏభై ఏళ్ల పతనానికా? అగమ్యగమనానికా?

ఏభై ఏళ్లు విజయవంతంగా జనాన్ని దగా చేసి పాలకులైనందుకా?

దేనికీ స్వర్ణోత్సవాలు? ఏమని దీన్ని అభినందిద్దాం?

ఈ దేశాన ఏం మిగిల్చారని, దేశీయతకు సలాం చేద్దాం!

అమ్మా, దేశమాతా! నీ దాస్యశృంఖలాలు వదిలినవనుకున్నాను. చివరకు నిన్నూ ఘోరంగా దగా చేశారమ్మా ఈ భ్రష్టులు!

అమ్మా, అమ్మా!" అని చేతులు ముఖానికి కప్పుకొని పెద్దంగ ఏడ్చిండు శివయ్య - కన్నతల్లి కాలం జేస్తే ఈడురాని పోరడు ఉగ్గపట్టి ఏడ్చినట్టు.

రాఘవులకి శివయ్య పరిస్థితి బొత్తిగ అర్థం గాలేదు.

చానా గాభరా పడ్డాడు. భయం భయంగా చూసిండు నాల్గేపులా.

'అమ్మో! వీనికి జర పిచ్చి లేచినట్టుంది!' అనుకున్నాడు.

ఆ వెంటనే 'వీడు తెలీక పిచ్చితో నన్ను గాన కరిస్తే?' అనిపించగనే రాఘవులు ఒళ్లంతా వణికింది. మెల్లిమెల్లిగ దూరంగ జరిగి ఒంటేలుకు పోసుకునేందుకన్నట్టు బాట పక్కదారికి చేరి, అక్కడనుంచి చావుకు తెగబడి మాలావు పరుగు తీసిండు - తుపాకీగుండుకు కూడా అందనంత వేగంగా.

ఇదేదీ గమనించలేదు శివయ్య.

దుఃఖం ఆగలేదు.

"చాయ్!" అన్నా వినిపించుకోనూలేదు.

ఎక్కెక్కి ఏడ్చిండు అక్కడే కూలబడి.

'సుబ్బిగాడు చెప్పిండు స్వతంత్రమొచ్చెనని, పాపన్న జెప్పిడు పాతదే బాగుందని' పాట వినిపిస్తోంది.

**(స్వాతంత్ర్య సమరయోధులను గుర్తించేందుకు పార్టీ కొక 'మెంబరు' కమిటీన వేసుకుని, వారిళ్ల కార్యకర్తలనూ, గులపోళ్లనూ, ఉంపుడుగత్తెలనూ స్వతంత్రసమరయోధులుగ గుర్తించి, భృతి ఇప్పించుకొనే దివాలాకోరు రాజకీయవ్యవస్థకు, మూలపురుషులైన ఏభై సంవత్సరాల మన పాలకులకు!)** ■